క్లుప్తంగా

కంతనపల్లి సర్పంచ్‌గా సామ్రాజ్యం



కన్నాయిగూడెం: మండలంలోని కంతనపల్లి సర్పంచ్ చింత నర్సక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఉప సర్పంచ్‌గా ఉన్న కంపెల్లి సామ్రాజ్యంను ఇన్‌చార్జ్ సర్పంచ్ ఎంపీడీఓ శుక్రవారం బాధ్యతలు అప్పగించారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా చంద్రవర్మ



వాజేడు: వాజేడు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా శుక్రవారం చంద్రవర్మ బాధ్యతలను స్వీకరించారు. గతంలో తహసీల్దార్‌గా పని చేసిన సర్వార్ పాషాను కన్నాయిగూడెం మండలానికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో చంద్రవర్మ బాధ్యతలను స్వీకరించారు. నూతన తహసీల్దార్‌గా బాధ్యతలను స్వీకరించిన చంద్రవర్మను కార్యాలయ సిబ్బంది, వీఆర్ఏలు శాలువాలు కప్పి సన్మానించారు.

డీటీగా సయ్యద్ సర్వర్ పాషా



కన్నాయిగూడెం: కన్నాయిగూడెం మండల డిప్యూటీ తహసీల్దార్‌గా సయ్యద్ సర్వర్ పాషా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీటీగా పనిచేసిన రామ్‌సింగ్ ఐటీడీఏ ఏటూరునాగారానికి బదిలీపై వెళ్లగా వాజేడులో విధులు నిర్వహిస్తున్న సయ్యద్ సర్వర్ పాషా కన్నాయిగూడెంకు వచ్చారు.

న్యూట్రిషన్ కిట్ల అందజేత



ఏటూరునాగారం: మండలం పరిధిలోని ఆకులవారిఘణం-3 హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో లబ్ధిదారులైన 26 మందికి కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను అందజేసినట్లు డాక్టర్ సుచరిత శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో రొయ్యూర్ సీహెచ్ఓ శారద, సూపర్‌వైజర్ కమల, ఏఎన్ఎంలు గీత, సుగుణావతి, పద్మ, ధనలక్ష్మి, భాగ్యమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ములుగు రూరల్: గోవిందరావుపేట మండలానికి చెందిన కాగితాల సుదర్శన్, పత్తిరి రాజు, లక్కాకుల సతీష్, యలమర్తి బాబు, గురుకు స్వరూపలు ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ శుక్రవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవియాదవ్, కంబాల రవి, చాంద్‌పాషా, ఓంప్రకాశ్, ప్రభాకర్, నాగేశ్వర్‌రావు, సోమయ్య, హరిప్రసాద్, క్రాంతి, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

సమీక్ష సమావేశం

మహదేవపూర్: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లుతో శుక్రవారం హరితహారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల వారిగా స్థలాలు గుర్తించి మొక్కలు నాటాలన్నారు. ఇంటింటికీ ఐదు నుంచి పది మొక్కలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రసాద్, ఏపీఓ రమేష్ తదితరులు ఉన్నారు.

మృత్యు 'మలుపులు'



తాడ్వాయి- మేడారం మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు



పస్రా-తాడ్వాయి మధ్యలో మలుపు

- ప్రమాదకరంగా మలుపులు
- సూచిక బోర్డులు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు

ఎస్ఎస్ తాడ్వాయి: రహదారిపై ఉన్న మలుపులు మృత్యు ద్వారాలుగా మారుతున్నాయి. తాడ్వాయి నుంచి మేడారం, తాడ్వాయి నుంచి పస్రా వరకు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వాహనదారులుకు ఈ దారుల్లో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాడ్వాయి నుంచి మేడారం వరకు 14కిలో మీటర్లు ఉండగా 14 మూల మలుపులు ఉన్నాయి. మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తాడ్వాయి నుంచి పస్రా వెళ్లే మార్గంలో కొండపర్తి గుట్ట మూల మలుపు, మొండ్యాల తోగు వద్ద మూల మలుపులు మరి ప్రమాదకరంగా ఉన్నాయి.

నిత్యం వేలాది వాహనాల రాకపోకలు

పస్రా నుంచి తాడ్వాయి, తాడ్వాయి నుంచి మేడారం వరకు నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. హనుమకొండ నుంచి ఏటూరునాగారం మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై పగలు రాత్రి తేడా లేకుండా భారీ నుంచి అతి భారీ వాహనాలు ఈ దారి గుండా ప్రయాణిస్తుంటాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి ఏటూరునాగారం మీదుగా మేడారానికి భక్తులు వందల సంఖ్యలో వస్తుంటారు.

నిర్లక్ష్యంగా అధికారులు

మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. అతి వేగంగా వచ్చే వాహనదారులు సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల తాడ్వాయి-పస్రా మార్గంలోని మొండ్యాల తోగు మలుపు సమీపంలో కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంకు చెందిన తల్లి, కుమారుడు అదుపు తప్పి మృతి చెందారు. అంతే కాకుండా కొద్ది రోజుల క్రితం మేడారానికి వస్తున్న భక్తుల వాహనం ఇదే దారిలో అదుపు తప్పి చెట్టుకు ఢీకొనగా ఓ మహిళ మృతి చెందిన సంఘటన కూడా చోటు చేసుకుంది. ఇలాంటి సంఘటనలు మలుపుల వద్ద తరుచుగా జరుగుతూనే ఉన్నాయి. అంతేకాకుండా తాడ్వాయి-మేడారం మార్గంలో కూడా మలుపు వద్ద భక్తుల వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొని స్వల్పగాయాలతో బయట పడిన సంఘటనలు ఉన్నాయి. ఈ రోడ్డు మార్గాన నిత్యం భక్తులు మేడారానికి తరలివస్తున్నారు. రాత్రి వేళల్లో సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

వేగం నియంత్రణపై దృష్టి



వేగంగా నడుపుతున్న వాహనాల నియంత్రణపై దృష్టి సారించాం. మలుపులు గుర్తించకపోవడంతో అదుపు తప్పి ప్రమాదాలు పెరుగుతున్నాయి. వాహనాల వేగం నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాం. తనిఖీలు నిర్వహించి వేగంగా నడుపుతున్న వాహనదారులకు సూచనలు చేస్తున్నాం. వాహనదారులు వేగం నడిపితే చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వరరావు, ఎస్సై, తాడ్వాయి

అర్హులందరికీ పోడు పట్టాలివ్వాలి

ములుగు రూరల్: అర్హులైన పోడుసాగుదారులకు పట్టాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని రాయినిగూడెం పోడు సాగుదారులతో కలిసి తహసీల్దార్ సత్యనారాయణస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయినిగూడెం గ్రామానికి చెందిన 32 మంది గిరిజనులు అమ్మ చెరువు సమీపంలో అటవీభూమిని పోడు సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. 2013లో ఫారెస్టు అధికారులు గిరిజనలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సాగులో ఉన్న 32 మందికి గాను 20 మందికి మాత్రమే పోడు పట్టాలు అందించారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 33 వేల మంది పోడు పట్టాలకు దరఖాస్తులు చేసుకుంటే కేవలం 18వేల 465 మందికి మాత్రమే పట్టాలు అందించారని అన్నారు. అధికారులు సర్వే నిర్వహించి పట్టాలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, నటరాజు, లక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

పారిశుద్ధ్య పనులను అడ్డుకున్న కార్మికులు



పనులను అడ్డుకుంటున్న కార్మికులు

వెంకటాపురం(కె): గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండటంతో మండల కేంద్రంలో అధికారులు పారిశుద్ధ్య నిర్వహణ పనులను శుక్రవారం ఇతర వ్యక్తులతో చేయిస్తుండటంతో గ్రామపంచాయతీ కార్మికులు అడ్డుకున్నారు. తాము సమ్మెలో ఉండగా ఇతర వ్యక్తులతో పనులు ఎలా చేయిస్తారని సర్పంచ్ చిడెం యామిలితో వాగ్వివాదానికి దిగారు. పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న వారిని అడ్డుకోని పనులను నిలుపుదల చేశారు. గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

వాహన పత్రాలు తప్పనిసరి

ఏటూరునాగారం: వాహనాదారులు తప్పనిసరిగా వాహన పత్రాలు కలిగి ఉండాలని ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ ఎదుట ప్రధాన రహదారిపై ఎస్సై శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లే వాహనాలపై దృష్టి పెట్టారు. మావోయిస్టు ప్రాబల్యం ఉన్న ప్రాంతం కావడంతో వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేసి, అందులో ప్రయాణిస్తున్న వారి వివరాలను సేకరించారు. వాహనదారులు ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు.

జీడివాగు వద్ద..

మండలం పరిధిలోని జీడివాగు వద్ద ఎస్సై శ్రావణ్‌కుమార్ శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఖమ్మం, వరంగల్ ప్రధాన రహదారిపై వెళ్లే వాహనాలను తనిఖీ చేసి వారి వద్ద వివరాలను సేకరించారు. వాహన పత్రాలు పరిశీలించి వదిలేశారు.



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై కృష్ణప్రసాద్

శిక్షణ తరగతుల కరపత్రాల ఆవిష్కరణ

కాటారం: జిల్లా కేంద్రంలో ఈ నెల 30, 31న నిర్వహించనున్న డీవైఎఫ్ఐ విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య చేతుల మీదుగా డీవైఎఫ్ఐ నాయకులు కరపత్రాలు ఆవిష్కరించారు. వైద్యం ఉపాధి రంగాలు, ఇతరాత్ర రంగాల్లో యువజన సమస్యలపై పోరాటాలు చేస్తున్న డీవైఎఫ్ఐ జిల్లా ఉద్యమ నాయకత్వాన్ని ముందుకు తీసుకుపోయేలా, శాస్త్రీయ, సైద్ధాంతిక అవగాహనలు కల్పించేందుకు ఈ తరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయని నాయకులు పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో వంద మంది ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా గర్ల్స్ కో కన్వీనర్ కవిత, హాకింగ్, నవీన్, ప్రత్యూష పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు పరామర్శ



చిట్యాల: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల: మండలంలోని గోపాలపూర్ గ్రామానికి చెందిన బోగం హరిశంకర్, రాదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, సర్పంచ్ దుప్పటి రజిత, శ్రీనివాస్, నాయకులు సురేష్, కుమార్ తదితరులు ఉన్నారు.

మహాముత్తారం: మండలకేంద్రానికి చెందిన శ్రీపతి పోషయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి శుక్రవారం పరామర్శించారు. అలాగే మండలంలోని బోర్లగూడెం గ్రామానికి చెందిన బానోత్ రాజమ్మ ఇటీవల అనారోగ్యంలో మృతి చెందిగా ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. దుర్గం మల్లయ్య, గంట కొండాల్‌రెడ్డి, శ్రీపతి సత్యం, అర్జయ్య ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మంగపేట: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌కుమార్ అన్నారు. మండలంలోని దోమెడలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వైద్య సిబ్బందిలో ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని తహసీల్దార్ శ్రీనివాసులు సందర్శించి నిర్వహణ, వ్యాధిగ్రస్తుల వివరాలు, గ్రామంలో పరిసరాల పరిశుభ్రత వివరాలను వైద్యాధికారి నిఖిల్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేడి ఆహారం తీసుకోవాలి

ఏటూరునాగారం: వర్షాకాలంలో ప్రజలు వేడి వేడి ఆహారం తీసుకోవాలని రొయ్యూర్ పీహెచ్‌సీ పరిధిలోని గోగుపల్లి వెల్నెస్ సెంటర్ వైద్యాధికారిని సుచరిత(పీడీఎంఓ) అన్నారు. శుక్రవారం గోగుపల్లి పరిధిలోని కొమురం భీం నగర్‌లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జర్వ పీడితులకు మలేరియా పరీక్షలు చేశారు. వర్షా కాలంలో వచ్చే జ్వరాలు, ఇతర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో ఔట్ పెషంట్స్ 42 మంది, మలేరియా టెస్టింగ్ 8, ఏఎన్‌సీ 4, పీఎన్‌సీ ఇద్దరికి పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శారద, హెల్త్ అసిస్టెంట్ జైల్‌బాబు, ఏఎన్ఎం ధనలక్ష్మి, ఆశ కార్యకర్తలు ఉన్నారు.



ఏటూరునాగారం: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు సుచరిత



మంగపేటలో..



మంగపేట: నీటి నిల్వలను పారబోస్తున్న వైద్యాధికారి నిఖిల్‌కుమార్

చేయూత



నగదు అందిస్తున్న జాకీర్‌హుస్సేన్ స్నేహితులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 1990–91 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తోటి స్నేహితుడు జాకీర్‌హుస్సేన్ సోదరి యాకూబీ వివాహం శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించగా వధువు తల్లికి జైనాబీకి రూ.30వేలు ఆర్థిక సాయం అందించి చేయూతనందించారు. కాగా మిత్రుడు జాకీర్ హుస్సేన్ నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా గతంలో కూడా వారికి తోటి స్నేహితులు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్‌రావు, చంద్రశేఖర్, ఆరిఫ్, వలిబాబా, ఇర్సవడ్ల భిక్షపతి, బాలోజీ బ్రహ్మం, జలీల్, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

వాజేడు: మండలంలోని రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గుంటక నర్సింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన జూన్ 23లోపు పట్టా చేసుకున్న రైతులు జూలై 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

ప్రహరీగా 'బతుకమ్మ' చీరలు

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా తెల్లరేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు చీరలను అందజేస్తుంది. కాగా, మండల కేంద్రంలోని 6వ వార్డులో ఓ ఇంటికి బతుకమ్మ చీరలు ప్రహరీకి పరదాలకు కట్టుకోవడం గమనార్హం. కోట్లాది రూపాయలు వెచ్చించి మహిళలకు అందజేస్తున్న చీరలను పరదాలకు ఉపయోగించడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ప్రహరీగా కట్టిన బతుకమ్మ చీరలు

'రేవంత్‌ను విమర్శించే స్థాయి లేదు'

భూపాలపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీలో రెండుసార్లు గెలిచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని టీపీసీసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. రైతులకు 24 గంటల కరెంటు ఇస్తున్నామని చెప్పి, ప్రైవేటు విద్యుత్ సంస్థల దగ్గర అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేస్తూ కమీషన్లు దండుకుంటున్న కేసీఆర్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పానున్నారని జోష్యం చెప్పారు. చాలీచాలని ఉచిత విద్యుత్ ఇస్తూ భారీ అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వం రైతుల చేతిలో తగిన మూల్యం చెల్లించుకుంటదన్నారు. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, 16వ వార్డు కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, రూరల్ మండల అధ్యక్షుడు రాంచంద్రయయ్య, మండల యూత్ అధ్యక్షుడు తోట రంజిత్, ముఖ్య నాయకులు అంబాల శ్రీనివాస్, నగునూరి రజినీకాంత్, పృథ్వి, చుంచుల మహేష్, సాగర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



వెంకటాపురం(కె): సమ్మె శిబిరంలో ఎమ్మెల్యే



ములుగు రూరల్: మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి



కన్నాయిగూడెంలో..

వెంకటాపురం(కె): పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని భద్రాలచం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం తొమ్మిదవ రోజు కొనసాగింది. సమ్మె శిబిరాన్ని ఎమ్మెల్యే వీరయ్య సందర్శించి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తెల్లం వెంకట్రావ్, పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహనరావు, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, ఎంపీటీసీలు గార్లపాటి రవి, కొండపర్తి సీతదేవి, పంచాయతీ కార్మికులు రంజిత్, శ్రీను, సమ్మయ్య, లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

ములుగు రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులల్లో మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మెకు సీపీఎం ఆధ్వర్యంలో మద్దతు ప్రకటించి మాట్లాడారు. జీఓ 60 ప్రకారం కార్మికులకు వేతనాలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రత్నం రాజేందర్, జన్ను రవి, నెమలి నర్సయ్య, తోకల రవి, గుగులోత్ రమేష్, అశోక్, భద్రమ్మ, సాంబయ్య, సురేందర్, రామకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మండలంలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు ఏటూరు గ్రామ ఉప సర్పంచ్ నాగేష్ మద్దతు తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నేరవెర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ నాయకుడు అరుణ్ కుమార్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ములుగు రూరల్: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని బంజరుపల్లి గ్రామ పంచాయతీ శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత రైతు బల్గూరి సారయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం ఎద్దు మేతకు వెళ్లిన క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ గడ్డిని తింటుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని రైతు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందించాలని కోరారు. ఇదే ప్రాంతంలో గతంలో ఒకరు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు విడిచినట్లు స్థానికులు తెలిపారు.



మృతి చెందిన ఎద్దు